కంపు కొడుతున్న 'శివారు'

- శివారులో మురుగుకష్టాలు
- అసంపూర్తిగా డ్రైనేజీ వ్యవస్థ
- రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు
- ఇబ్బందిపడుతున్న కాలనీవాసులు



ఇందిరానగర్ శివారులో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మేజర్ గ్రామపంచాయతీలోని శివారు ప్రాంతాల్లో మురుగునీటి సమస్యతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో మురుగుకాలువలు నిర్మించారు. కానీ మురుగునీటిని ఇళ్లకు దూరంగా మళ్లించడంలో అధికారులు విఫలమయ్యారు. మురుగుకాలువల ద్వారా వస్తున్న నీరంతా రోడ్లపైనే పారుతుండటంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. దానికితోడు దోమలు వృద్ధి చెంది అనారోగ్యం బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

ఏళ్లుగా ఇదే సమస్య..

తంగళ్లపల్లి గ్రామ పంచాయతీలో ఇందిరానగర్ అనే ప్రాంతంలో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ పట్టాలు ఇవ్వడంతో ఇందిరమ్మ పేరుతో ఇందిరానగర్ ఏర్పడింది. అయితే నిరుపేదలు ఉండే ఈ కాలనీల్లో అధికారులు చిన్నచూపు చూస్తున్నారని ఆ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. తాము ఏళ్లుగా మురుగు సమస్యతో బాధపడుతున్నామని తమగోడు నాయకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రజాప్రతినిధుల పదవికాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలనలోనైనా తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

దుర్గంధం.. దోమల బెడద

పైనుంచి వస్తున్న మురుగు నీరు మొత్తం ఆవాసాల మధ్యలో రోడ్డుపై నిలుస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. దానికితోడు దోమలకు ఆవాసంగా మారి స్థానికులు తరుచూ విషజ్వరాల బారినపడుతున్నారు. వర్షాకాలంలో ఇళ్లలోంచి బయటకు రావాలంటే నడవలేని పరిస్థితి నెలకొందని వారు వాపోతున్నారు. తమగోడు ఎవరికి పట్టడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మురుగునీటిని జనావాసాలకు దూరంగా మళ్లించాలని, లేదా శివారులో ఇంకుడుగుంత ఏర్పాటుచేస్తే తమ సమస్య తీరుతుందని వారు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



ఇందిరానగర్ శివారులో నాలుగేళ్లుగా ఉంటున్నా. ఇక్కడ మోరీ నీరంతా రోడ్ల మీదనే పారుతోంది. ఏ ఒక్కరు పట్టిచుకోవడం లేదు. మురుగునీటిలో జారిపడ్డాను. డ్రైనేజీ నీరంతా రోడ్లపై పారకుండా చర్యలు తీసుకోవాలి.

– సుద్దాల లక్ష్మి, ఇందిరానగర్

రోడ్డుపైనే పారుతోంది



మురుగునీరంతా రోడ్లపైనే పారుతోంది. ఒక్క అధికారి ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. ఎన్నికల సమయంలో తప్ప ఇటువైపు చూసిన నాథుడే లేడు. ఇప్పటికైనా ఈ మురుగునీటి సమస్యను పరిష్కరించాలి. ఇబ్బందులు తీర్చాలి.

– ఎనగందుల మురళి, ఇందిరానగర్

చర్యలు తీసుకుంటాం



మురుగునీరు జనావాసాల మధ్య నిలుస్తుందన్న విషయం తమ దృష్టికి వచ్చింది. దీనిపై చర్యలు తీసుకుంటాం. గ్రామ పంచాయతీలో ప్రత్యేక అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం. నీరు నిల్వ ఉండకుండా తాత్కాలికంగా కాలువలు ఏర్పాటు చేస్తాం

– శ్రీధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తంగళ్లపల్లి

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లటౌన్: మహాత్మా జ్యోతిబాపూలే పురుషుల గురుకుల డిగ్రీ కళాశాల ఎల్లారెడ్డిపేటలో ప్రవేశాలకు అర్హులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే. వీరప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను బీఎస్సీ (ఎంపీసీఎస్), బీఎస్సీ(బీజడ్సీ), బీ.కాం (సీఏ) గ్రూపుల్లో ఇంగ్లిష్ మీడియంలో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ధ్రువపత్రాలతో వచ్చి ఈనెల 13 వరకు కళాశాలలో చేరవచ్చన్నారు. నాణ్యమైన విద్యతో పాటుగా ఉచిత దుస్తులు, వసతి, పాఠ్యపుస్తకాలు, తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

కోడె మొక్కు చెల్లించుకున్న బీజేపీ నాయకులు


కోడె మొక్కు చెల్లించుకుంటున్న నాయకులు

వేములవాడ: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ భారీ మెజారిటీతో గెలుపొందడంతో ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అభివృద్ధితోపాటు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల అభివృద్ధికి పాటుపడాలని వారు రాజన్నకు మొక్కుకున్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంటి మహేశ్ బుధవారం ఎంపీ బండి సంజయ్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థినికి అభినందన


పావని

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన పాముల లత–శ్రీనివాస్ దంపతుల కూతురు పావని నీట్ ఫలితాల్లో 493 మార్కులు సాధించింది. మంగళవారం వెలువడిన 2024 నీట్ ఫలితాల్లో పావని ఉత్తమ మార్కులు సాధించడంపై గ్రామస్తులు అభినందించారు. మండలకేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియంలో పదో తరగతి చదివిన పావని 10 జీపీఏ సాధించింది. హైదరాబాద్‌లోని నారా యణ కళాశాలలో ఇంటర్ చదివిన ఆమె 964 మార్కులు సాధించింది.

బోయినపల్లిలో వర్షం


పోస్టాఫీస్ రోడ్డులో నిలిచిన నీరు

బోయినపల్లి: మండలకేంద్రంలో బుధవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. సుమారు గంటపాటు వర్షం కురిసిన వర్షంతో రోడ్లపై నీరుచేరి గుంతల్లో వర్షపునీరు నిలిచింది. ఈ సీజన్‌లో ఇదే మంచి వర్షమని రైతులు చెబుతున్నారు.

రక్తదాన శిబిరం



బోయినపల్లి: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదినం సందర్భంగా మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, వన్నెల రమణారెడ్డితో పాటు సుమారు 20 మంది యువకులు రక్తదానం చేశారు. అంతకు ముందు అంబేద్కర్ చౌరస్తాలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సెస్‌డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, ఎంపీటీసీ శ్రీనివాస్, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, పులి లక్ష్మిపతి, సంబ లక్ష్మిరాజం, జంగం అంజయ్య, కనుకయ్య, బోయిని ఎల్లేశ్, పిట్టల రమేశ్, జంగ సత్యం, వంశీ, సుమీన్, ప్రశాంత్, అమ్మిగల్ల గోపాల్, గుంటి జలేందర్, నిమ్మ వినోద్‌రెడ్డి, వెంకటేశ్, నజీర్, దేవయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

తంగళ్లపల్లి: మండలంలోని బండలింగంపల్లి గ్రామానికి చెందిన చింతల బాలరాజు (16) ఆస్పత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈనెల 3న బీరప్ప జాతరకు వెళ్లి తిరిగి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న బాలుడిని ఓ యువకుడి బైక్ ఢీకొంది. తీవ్రగాయాలైన బాలరాజును చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు యాదగిరి, బాలవ్వ కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు.

సహజ వనరుల విధ్వంసంపై చర్యలేవి ?


మాట్లాడుతున్న బొడ్డు దేవయ్య

- రాష్ట్ర సహజ వనరుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు బొడ్డు దేవయ్య

సిరిసిల్లకల్చరల్: సొంత ప్రయోజనాల కోసం సహజ వనరులను విధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలవుతున్నాయని రాష్ట్ర సహజ వనరుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు బొడ్డు దేవయ్య ఆరోపించారు. బుధవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వస్త్ర, వ్యాపార సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొందరు బడాబాబులు తమ ఆర్థిక ప్రయోజనాల కోసం సహజ వనరులను కొల్లగొడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళారులు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ సామాన్య ప్రజలకు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. సహజ వనరులను కొల్లగొడుతున్న వారిని అడ్డుకునేందుకు ప్రజలు సంఘటితం కావాలన్నారు. సమావేశంలో సమితి ప్రతినిధులు చందనగిరి గోపాల్, వాసాల మల్లేశం, బొంపల్లి సురేందర్‌రావు, మాజీ సర్పంచుల సంఘం కార్యదర్శి బుర్ర మల్లేశం గౌడ్ అంబేద్కర్ సేవా సమితి కోఆర్డినేటర్ మంగలి చంద్రమౌళి, ఏఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు కడారి రాములు, లంబాడి ఐక్యవేదిక అధ్యక్షుడు నరేశ్ ఏనాయక్ ఎమ్మార్పీఎస్ నాయకులు గుండా తామస్, తాళ్లపల్లి ప్రభాకర్, వంగపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకు అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న గాజుల శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: సహకార అర్బన్‌బ్యాంకు అభివృద్ధే లక్ష్యంగా బీజేపీ అభ్యర్థులు పనిచేస్తారని ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో బీఆర్ఎస్‌కు చెందిన అభ్యర్థుల పాలకవర్గం సభ్యులకు డివిడెండ్ చెల్లించలేదన్నారు. అయినా మళ్లీ అధిపత్య పోరుతో ముందుకువస్తున్నారని వారికి ఓట్లు వేయకుండా బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తే..బ్యాంకును అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కొత్త సభ్యత్వాలు బీజేపీతోనే సాధ్యమన్నారు. బీఆర్ఎస్ అక్రమాలపై ప్రజలు ఆలోచించాలని, బ్యాంకు అభివృద్ధికి తమ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు గాజుల సదానందం, కొండ నరేశ్, శ్రీనివాస్, బాలకిషన్, శ్రీహరి, మహేశ్, తదితరులున్నారు.

కార్మికుల హక్కుల సాధనకు కృషి



మాట్లాడుతున్న కోడం రమణ

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు రాకుండా పస్తులుంటున్నా..సర్కారు పట్టించుకోవడం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే జీపీ కార్మికులను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. కొత్తగా గద్దెనెక్కిన కాంగ్రెస్ కూడా అదేబాటలో నడిస్తే సహించబోమన్నారు. కార్మికుల హక్కులు, డిమాండ్ల సాధనకు ఈనెల 7న కలెక్టరేట్ ముట్టడి చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని లేకపోతే ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకుల లింగంపల్లి కృష్ణవేణి, వర్కోలు మల్లయ్య, నారపురం నర్సయ్య, సందెల మహేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు వినియోగంపై అవగాహన


వర్మీ కంపోస్టు బ్యాగులు అందిస్తున్న సిబ్బంది

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రైతువేదిక భవనంలో బుధవారం ప్లాస్టిక్ కవర్ల నిషేధం, వర్మీ కంపోస్టు ఎరువు వినియోగంపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కంపోస్టు షెడ్ వద్ద తయారు చేసిన వర్మీ కంపోస్టు ఎరువులను రైతులకు అందించారు. 5 కేజీల బ్యాగుకు రూ.100 చొప్పున 10మంది రైతులకు 50 కేజీల వర్మీ కంపోస్టు రైతులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, ఎంపీడీవో బీమా జయశీల, ఎంపీవో ఏ.గంగాతిలక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఈవో, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్


వీర్నపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

గంభీరావుపేట: మండలంలోని లింగన్నపేటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మజ అన్నారు. ప్లాస్టిక్ నివారణ, మొక్కల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుకన్య, లక్ష్మి, అనిత, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని మంగళవారం ఏపీవో శ్రీహరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా ఉపాధి కూలీలు మొక్కలు నాటారు. నీటి సంరక్షణ ప్రాముఖ్యతపై వారికి వివరించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు అంబుడ్స్ మెన్ రాకేశ్, క్షేత్ర సహాయకులు అజ్మీరా రాజు మేట్స్ లింబాద్రి, రాజు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలకేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరవింద, టీచర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ వృద్ధాశ్రమంలో ..

మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమం ఆవరణలో వృద్ధులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆశ్రమ కోఆర్డినేటర్ ఎం.మమత, అసిస్టెంట్ కోఆర్డినేటర్ బి.వెంకటేశ్, వృద్ధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



వేములవాడ: వేములవాడ పట్టణానికి చెందిన చింతల్‌డెం మైసయ్య, చింతల్‌తాడెం హన్మవ్వ, మామిండ్ల మల్లమ్మ, ఎదురుగట్ల మల్లేశం, కందుల శంకర్ ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, కౌన్సిలర్ ఇప్పపూల అజయ్, పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగారం వెంకటస్వామి, పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేశ్, నాయకులు చిలుక రమేశ్, పుల్కం రాజు, వస్తాది కృష్ణ, నాగభూషణం, సాబీర్ తదితరులున్నారు.

ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శ

వేములవాడ మున్సిపల్ కౌన్సిలర్ కందుల శ్రీలత, ఆమె భర్త అడ్వకేట్ కందుల క్రాంతికుమార్ కుటుంబ సభ్యులను ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. క్రాంతికుమార్ తండ్రి అనారోగ్యంతో మృతిచెందగా మృతికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

మద్యంతాగి వాహనాలు నడపొద్దు



తంగళ్లపల్లి: మండలకేంద్రంలో మంగళవారం రాత్రి ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. మద్యంతాగి వాహనాలు నడిపితే కేసులుకేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు భద్రత నియామాలను విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు గంప నాగేంద్రంకు చెందిన ద్విచక్రవాహనం బుధవారం చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నాగేందర్ తన బంధువులను ఎక్కించేందుకు బుధవారం మధ్యాహ్నం కొత్తబస్టాండ్‌కు ఏపీ15ఏ 7009 నంబర్ గల స్ప్లెండర్ ప్లస్ బైక్‌పై వెళ్లాడు. కొత్తబస్టాండ్ కాంపౌండ్ పక్కన చెట్టు కింద పార్కింగ్ చేశాడు. బస్సు ఎక్కించి పది నిమిషాల్లో తిరిగి బైక్ వద్దకు వచ్చి చూసే సరికి కనిపించలేదు. ఆ ప్రాంతంలో ఎక్కడ వెతికినా కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి


క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ చేస్తున్న నాయకులు

చందుర్తి: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అన్నారు. మండలంలోని మర్రిగడ్డలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంతుపూరి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి క్రీడాకారులకు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. లక్ష్య సాధనకు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో మల్యాల నర్సయ్య, ఏరెడ్డి వెంకట్‌రెడ్డి, నేతికుంట తిరుపతి, సంకోజీ హరీశ్, దారం బాల్‌రెడ్డి, మనోహర్, ముద్దాల రాము, అమరబండ సాయి కుమార్, క్రీడాకారులు నితిన్, వంశీ, హేమంత్, అజయ్, ప్రశాంత్, గోవర్ధన్, శ్రావణ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ ఎన్నికల ప్రచారంలో మండల నాయకులు


సిరిసిల్లలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఎన్నికల బరిలో ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీకి చెందిన అభ్యర్థుల గెలుపుకోసం మండల నాయకులు బుధవారం మద్దతుగా సిరిసిల్ల పట్టణంలో ప్రచారం చేశారు. అర్బన్ బ్యాంక్ పరిధిలోని బ్యాంక్‌లో సభ్యత్వం ఉన్న ఓటర్ల జాబితా ప్రకారం మండలంలో ఉన్నవారి వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికలను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు ప్రచారం చేస్తున్నారు. ప్రచారం చేసిన వారిలో జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గుల్లపల్లి నర్సింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం వితరణ

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని 36వ వార్డులో గాజుల ప్రవీణ్ ఇటీవల మృతిచెందాడు. పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబ సభ్యులను కౌన్సిలర్ కల్లూరి రాజు బుధవారం పరామర్శించి 50కిలోల బియ్యం అందించారు. ఇక్కడ వార్డుపెద్దలు గడ్డం వెంకటేశ్, కొక్కుల నర్సయ్య తదితరులున్నారు.

నిత్యావసరాలు అందజేత

చందుర్తి : ఈదురుగాలుల బీభత్సానికి ఇంటి పైకప్పు లేచిపోయి మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన కైరి వెంకటేశం కుటుంబానికి గ్రామ కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్, నిత్యావసర సరుకులను బుధవారం అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయం అందించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీనివాస్ ఫోన్‌లో హామీ ఇచ్చారు. సంటి ప్రసాద్, రాజయ్య, రవి ఉన్నారు.

నిరాశ చెందొద్దు

ఎల్లారెడ్డిపేట: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపు కోసం కాంగ్రెస్ కార్యకర్తలు అవిశ్రాంతంగా పోరాటం చేశారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. బ్లాక్ కాంగ్రెస్ పరిధిలోని మూడు మండలాల్లో కార్యకర్తలు గెలుపుకోసం కష్టపడ్డారని,రాజేందర్‌రావు ఓటమి చెందినా కార్యకర్తలు నిరాశకు గురికావద్దన్నారు. బీజేపీ రామమందిరం అక్షింతలతో, బీఆర్ఎస్ అభ్యర్థి డబ్బులతో ఓట్లు సంపాదించుకున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోపు గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



రుద్రంగి: మండలకేంద్రంలోని మహాలక్ష్మి కాలనీ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ, మహాలక్ష్మి బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బైండ్లోళ్ల ఆటపాటల మధ్య ఆలయాలకు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. అమ్మవార్లకు బోనం సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అధ్యక్షుడు దర్మేంధర్, సభ్యులు నరేశ్, శ్రీనివాస్, విక్రమ్, వినోద్, గంగారాం, గణేశ్, నవీన్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు


సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని సంకెపల్లి, ఆరెపల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. కరీంనగర్ బీజేపీ ఎంపీగా బండి సంజయ్ రెండోసారి గెలుపొందడంతో నాయకులు పటాకులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చింతపల్లి వేంకటేశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి బుర్ర శేఖర్‌గౌడ్, చింతపల్లి మోహన్‌రావు, నాగుల సురేశ్, కనకరాజు, కాచం నిఖిల్, భాను, శేఖర్ తదితరులు ఉన్నారు.